సాక్షి అల్లూరి సీతారామరాజు జిల్లా

మంగళవారం । 30 । ఆగస్టు । 2022

సింగర్.. ఫైటర్.. డ్యాన్సర్ శరణ్య



- విశాఖ బాలికకు గ్లోబల్ చైల్డ్ ప్రాడిజీ అవార్డు
- అన్నింటా మేటి శరణ్య

సెంటర్‌స్ప్రెడ్‌లో..

విశిష్ట నిలయం.. ఒడ్డిమెట్ట ఆలయం

సెంటర్‌స్ప్రెడ్‌లో..



- తాడిచెట్టు మొదలులో లక్ష్మీగణపతి
- గ్రామీణ భక్తుల కొంగు బంగారం



విద్యుత్ కేంద్రాల ఆధునికీకరణకు చర్యలు

8లో

సీలేరు జలవిద్యుత్ కాంప్లెక్స్ పరిధిలోని విద్యుత్ కేంద్రాల ఆధునికీకరణకు చర్యలు చేపడుతున్నట్టు చీఫ్ ఇంజినీర్ సి.డి.వి.ఎల్. కుమార్ తెలిపారు.

న్యూస్‌రీల్

పీఆర్ ఈఈ బాధ్యతల స్వీకరణ



బాధ్యతలు స్వీకరించిన కొండయ్య పడాల్

సాక్షి,పాడేరు : పంచాయతీ రాజ్ శాఖ పాడేరు ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్‌గా కొండయ్య పడాల్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇంత వరకు ఇక్కడ ఈఈగా పనిచేసిన లావణ్యకుమార్‌ను ప్రభుత్వం ఎస్ఈగా నియమించింది. దీంతో అరకులోయ సబ్ డివిజన్‌లో డీఈఈగా పనిచేస్తున్న కొండయ్య పడాల్‌ను ఈఈగా నియమిస్తూ ప్రభుత్వం ఆదేశాలు జారీ చేయడంతో ఆయన బాధ్యతలు స్వీకరించారు. హుకుంపేట మండలం కొంతిలి గ్రామానికి చెందిన కొండయ్య పడాల్‌ను ఈఈగా నియమించడంపై స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.

ఏకలవ్య విద్యార్థులకు బంగారు పతకాలు



పతకాలు సాధించిన విద్యార్థులతో ఉపాధ్యాయులు


చింతూరు: గుంటూరులో ఈనెల 26 నుంచి 28 వరకు జరిగిన రాష్ట్రస్థాయి జూనియర్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ పోటీల్లో చింతూరు ఏకలవ్య పాఠశాల విద్యార్థులు రెండు బంగారు, ఒక రజత పతకం దక్కించుకున్నారు. అండర్–14 విభాగంలో పాఠశాలకు చెందిన పైదా అనితా గ్లోరీ లాంగ్ జంప్‌లో, రవ్వ రమ్యశ్రీ హైజంప్‌లో ప్రథమస్థానంలో నిలిచి బంగారు పతకాలు, కుంజా కౌశిక్ జావెలిన్ త్రోలో ద్వితీయస్థానంలో నిలిచి రజత పతకాన్ని సాధించారు. దీంతోపాటు గుంటూరులోనే వచ్చేనెల 9 నుంచి 11 వరకు జరగనున్న జాతీయస్థాయి పోటీలకు వీరు ఎంపికయ్యారు. తమ విద్యార్థులు ప్రతిభ కనబరచి పతకాలు సాధించడం పట్ల కళాశాల ప్రిన్సిపాల్ స్వామి, పీఈటీ గంగాధర్‌రావు, ఇతర ఉపాధ్యాయులు, తోటి విద్యార్థులు హర్షం వ్యక్తంచేశారు.

శరవేగంగా ఎన్‌హెచ్ నిర్మాణం

- పాడేరు నుంచి అరకులోయ వరకు ఇప్పటికే పలు చోట్ల పూర్తి
- భారీ వంతెనల ఏర్పాటు



హుకుంపేట మండలం రంగశీల వద్ద నిర్మాణం పూర్తయిన జాతీయ రహదారి



డుంబ్రిగుడ-అరకులోయ రోడ్డులోని చాపరాయి సమీపంలో నిర్మిస్తున్న హై లెవెల్ వంతెన

సాక్షి,పాడేరు : జిల్లాలో 516ఈ జాతీయ రహదారి నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. రాజమహేంద్రవరం నుంచి విజయనగరం వరకు ఈ రహదారి నిర్మాణాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రతిష్టాత్మకంగా చేపట్టాయి. పాడేరు నుంచి హుకుంపేట, డుంబ్రిగుడ మండలాల మీదుగా అరకులోయ వరకు ప్రస్తుతం నిర్మాణ పనులు జరుగుతున్నాయి. పలు చోట్ల బైపాస్ నిర్మాణాలకు కూడా రెవెన్యూశాఖ స్థలాలను సేకరించి అందుబాటులో తెచ్చింది. పాడేరులోని చింతలవీధి జంక్షన్ నుంచి అరకులోయలోని కొత్తబల్లుగుడ వరకు పనులు జరుగుతున్నాయి. ఇప్పటికే పలు చోట్ల రోడ్డు నిర్మాణ పనులు పూరయ్యాయి. విశాలమైన రోడ్డు నిర్మాణంతో వాహనచోదకులు, పర్యాటకులు, స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. పాడేరు నుంచి డుంబ్రిగుడ మండలం గొందివలస వరకు ప్యాకేజి–4, గొందివలస నుంచి అరకులోయ మండలం కొత్తబల్లుగుడ వరకు ప్యాకేజి–5 పనులు నిర్వహిస్తున్నారు. సుమారు 52 కిలోమీటర్ల పొడవున నిర్మిస్తున్న పాడేరు, అరకులోయ జాతీయ రహదారి నిర్మాణ పనులు చురుగ్గా జరుగుతున్నాయి. పాడేరు, అరకులోయ ప్రాంతాల మధ్య పలు చోట్ల భారీ, హై లెవెల్ వంతెనలు నిర్మిస్తున్నారు. డుంబ్రిగుడ మండలంలోని చాపరాయి జలపాతం సమీపంలోని ప్రమాదకర మలుపువద్ద, అరకుసంతబయలు దాటిన తర్వాత రైల్వేలైను వద్ద హైలెవెల్ వంతెనల నిర్మాణ పనులు చురుగ్గా జరుగుతున్నాయి. ఈ రోడ్డులో మొత్తం 60 కల్వర్టుల నిర్మాణ పనులు దాదాపు పూర్తయ్యాయి. పలు ప్రాంతాల్లో కొండలను తొలగించి రోడ్డు నిర్మాణానికి చర్యలు తీసుకున్నారు. నిర్మాణ పనులు పారదర్శకంగా నిర్వహిస్తున్నారు. నాణ్యతా ప్రమాణాల్లో రాజీ పడకుండా కేంద్ర జాతీయ రహదారుల విభాగం అధికారులు నిరంతరం తనిఖీ చేస్తున్నారు.

భూ సర్వే

370 కిలోమీటర్ల జాతీయ రహదారి నిర్మాణానికి రూ.1576 కోట్లు మంజూరు చేశారు. దీంతో రాజమహేంద్రవరం నుంచి విజయనగరం వరకు ఆరు ప్యాకేజీల కింద రోడ్డు నిర్మాణాన్ని విభజించి, వేర్వేరుగానే టెండర్ల ప్రక్రియను జాతీయ రహదారుల విభాగం అధికారులు పూర్తి చేశారు. ప్రస్తుతం పాడేరు నుంచి అరకులోయ వరకు జాతీయ రహదారి నిర్మాణ పనులు జరుగుతున్నాయి. మిగిలిన రాజమహేంద్రవరం నుంచి రంపచోడవరం, రంపచోడవరం నుంచి కృష్ణదేవిపేట, కృష్ణదేవిపేట నుంచి పాడేరు వరకు జాతీయ రహదారి నిర్మాణ పనులకు సంబంధించి భూముల సేకరణను అధికారులు పారదర్శకంగా చేపడుతున్నారు. ఆర్‌అండ్‌బీ రోడ్డుకు

మిగతా 2వ పేజీలో ▸

దొరగూడలో రాష్ట్ర పశు వైద్య బృందం పర్యటన



ఉబ్బెగుల వాగు దాటుతున్న రాష్ట్ర పశు సంవర్ధకశాఖ బృందం

-3లో

ఈ-పంట నమోదు వేగవంతం



వరి పొలాన్ని పరిశీలించేందుకు వెళుతున్న జాయింట్ కలెక్టర్ శివ శ్రీనివాసు

గూడెంకొత్తవీధి : ఈ–పంట నమోదును వేగవంతం చేయాలని జాయింట్ కలెక్టర్ జి.శివ శ్రీనివాస్ ఆదేశించారు. మండలంలో సోమవారం ఆయన పర్యటించారు. ముందుగా తహసీల్దార్ కార్యాలయంలో అధికారుల పనితీరును పరిశీలించి, రికార్డులను తనిఖీ చేశారు. అనంతరం స్థానిక రైతు భరోసా కేంద్రం వద్ద వీఆర్‌వోలు, సచివాలయ సిబ్బంది, వ్యవసాయ, ఉద్యానవనశాఖ అధికారులు, సర్వేయర్లతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి రైతు పంట సాగు వివరాలను సక్రమంగా నమోదు చేయాలని, తద్వారా ప్రభుత్వ పథకాలు రైతులకు అందుతాయని చెప్పారు. మ్యుటేషన్ ప్రక్రియను వేగవంతం చేయాలని సూచించారు. పూజారిపాకలులో పసుపు, వరి పొలాలను పరిశీలించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ రైతుల సంక్షేమం కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను అర్హులైన వారందరికీ అందేలా అధికారులు కృషి చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ రాజ్‌కుమార్, వ్యవసాయ అధికారి మధుసూదన్ తదితరులు పాల్గొన్నారు.

స్పందనకు 70 అర్జీలు



స్పందనలో వినతులు స్వీకరిస్తున్న పీవో సూరజ్ గనోరే

రంపచోడవరం: స్థానిక ఐటీడీఏ సమావేశం హాలులో సోమవారం నిర్వహించిన స్పందనలో 70 మంది నుంచి అర్జీలు స్వీకరించినట్టు రంపచోడవరం ఐటీడీఏ పీవో సూరజ్ గనోరే తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ, ఉద్యోగ కల్పన, వ్యక్తిగత సమస్యలకు సంబంధించిన దరఖాస్తులు ఎక్కువగా వచ్చినట్టు చెప్పారు. కొన్ని సమస్యలను వెంటనే పరిష్కరించి, మరికొన్ని దరఖాస్తులను పరిష్కారం కోసం సంబంధిత అధికారులకు పంపినట్టు చెప్పారు. మారేడుమిల్లి మండలం బోదులూరు గ్రామం పాఠశాలలో మరుగుదొడ్లకు మరమ్మతులు చేయించాలని, చట్లవాడ గ్రామం నుంచి పోట్లవాడ జంక్షన్ వరకు రోడ్డుకు మరమ్మతులు చేయించాలని, ఏపీ ఫైబర్ కనెక్షన్ ఏర్పాటు చేయాలని, చట్లవాడ సర్పంచ్ దూడ ప్రేమ్‌లత అర్జీలు అందజేశారు. ప్రభుత్వ పాఠశాలలో పనిచేస్తున్న అర్హులైన ఉపాధ్యాయులకు పదోన్నతులు కల్పించాలని, రంపచోడవరం ప్రభుత్వ పాఠశాలకు ఆట స్థలం ఏర్పాటు చేయాలని, ఆశ్రమ పాఠశాలలో ఏఎన్ఎం పోస్టులు భర్తీ చేయాలని ఏపీటీడబ్ల్యూటీయూ జిల్లా అధ్యక్షుడు బుడమల మంగిరెడ్డి, కారం రంగారావు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సబ్ కలెక్టర్ కట్టా సింహాచలం, ఏపీవో జనరల్ సీహెచ్ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా...

విద్యార్థుల ఆందోళనపై డీడీ విచారణ



విచారణ నిర్వహిస్తున్న డీడీ కొండలరావు

చింతపల్లి రూరల్: తమ సమస్యలు పట్టించుకోకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న స్థానిక గురుకుల కళాశాల ప్రిన్సిపాల్‌ను తొలగించాలని విద్యార్థులు చేస్తున్న ఆందోళనపై సోమవారం గిరిజన సంక్షేమశాఖ డీడీ కొండలరావు విచారణ నిర్వహించారు. మెనూ సక్రమంగా అమలు చేయడం లేదని, తరగతి గదులు అధ్వానంగా ఉన్నా ప్రిన్సిపాల్ పట్టించుకోవడం లేదని ఆరోపిస్తూ విద్యార్థులు నిరసన వ్యక్తం చేస్తున్నారు. దీనిపై విచారణ నిర్వహించిన గిరిజన సంక్షేమశాఖ డీడీ మాట్లాడుతూ నివేదికను ఉన్నతాధికారులకు పంపుతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు ప్రభుదాస్,జీవన్ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల సంక్షేమమే లక్ష్యంగా పనిచేయాలి

సాక్షి,పాడేరు : ప్రభుత్వం ఆదేశాల మేరకు అన్ని గిరిజన సంక్షేమ కాలేజీ హాస్టళ్లలో విద్యార్థుల సంక్షేమం లక్ష్యంగా హాస్టళ్లను నిర్వహించాలని ఏటీడబ్ల్యూవో ఎల్.రజిని ఆదేశించారు. సోమవారం సాయంత్రం ప్రభుత్వ జూనియర్, డిగ్రీ కళాశాలల గిరిజన హాస్టళ్లను ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థినులతో సమావేశమై సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఆమె మాట్లాడుతూ విద్యార్థులకు నాణ్యమైన ఆహారం అందించాలని, మెనూ అమలులో నిర్లక్ష్యం వహిస్తే ఉపేక్షించేది లేదని హెచ్చరించారు.

రాష్ట్రపతికి ఈ-పోస్టు ద్వారా అభినందనలు



పోస్ట్ కార్డును ఆవిష్కరిస్తున్న సీఐ జి.డి.బాబు, తపాలా శాఖ ఐపీవో ఉపేంద్ర

అరకులోయ రూరల్: రాష్ట్రపతి ద్రౌపదీ ముర్మకు అభినందనలు తెలియజేసేందుకు తపాలా శాఖ అవకాశం కల్పించింది. ఈ పోస్టు ద్వారా ఎవరైనా అభినందనలు తెలియజేయవచ్చు. సోమవారం సీఐ జి.డి.బాబు పోస్టు కార్డులను ఆవిష్కరించారు. ఈసందర్భంగా సీఐ, స్థానిక ఐపీవో ఉపేంద్ర వేర్వేరుగా మాట్లాడుతూ మొట్టమొదటి సారిగా ఆదివాసీ మహిళ ద్రౌపదీ ముర్ము రాష్ట్రపతిగా ఎన్నికయ్యారని, ఆమెకు అభినందనలు తెలియజేసేందుకు తపాలా శాఖ మంచి అవకాశం కల్పించిందన్నారు. గతంలో టెలిగ్రాం ద్వారా అభినందనలు జేసేవారని, ఇప్పుడు రూ.10 చెల్లించి ఈ-పోస్టు ద్వారా తెలియజేయవచ్చన్నారు. కంఠబంసుగుడ గిరిజన ఆశ్రమ పాఠశాలలో ఈ-పోస్టు పై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఎస్ఐ సంతోష్, సింహాచలం,దయానిధి పాల్గొన్నారు.

వ్యవహారిక భాషోద్యమ పితామహుడు ‘గిడుగు’

- పాడేరు ఐటీడీఏ పీవో గోపాలకృష్ణ

సాక్షి,పాడేరు : తెలుగు వ్యవహారిక భాషోద్యమ పితామహుడు గిడుగు వెంకటరామ్మూర్తి అని ఐటీడీఏ పీవో ఆర్.గోపాలకృష్ణ అన్నారు. సోమవారం పీవో క్యాంపు కార్యాలయంలో గిడుగు రామ్మూర్తి 159వ జయంతిని ఘనంగా నిర్వహించారు. చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పీవో మాట్లాడుతూ గిడుగు జయంతి సందర్భంగా తెలుగుభాషా దినోత్సవాన్ని జరుపుకొంటున్నామని చెప్పారు. ఐటీడీఏ ఏపీవోలు వి.ఎస్.ప్రభాకర్, ఎం.వెంకటేశ్వరరావు, గిరిజన సంక్షేమ డీడీ కొండలరావు, ఈఈ డీవీఆర్ఎం రాజు, పరిపాలనాధికారి హేమలత తదితరులు గిడుగు రామ్మూర్తి చిత్రపటం వద్ద నివాళులర్పించారు.

హాకీ క్రీడకు వన్నె తెచ్చిన ధ్యాన్‌చంద్

హాకీ క్రీడకు ధ్యాన్‌చంద్ వన్నె తెచ్చారని ఐటీడీఏ పీవో ఆర్.గోపాలకృష్ణ అన్నారు. జాతీయ క్రీడా దినోత్సవం, ధ్యాన్‌చంద్ జయంతి సందర్భంగా పీవో క్యాంపు కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పీవో మాట్లాడుతూ దేశంలో హాకీ క్రీడకు ధ్యాన్‌చంద్ ఆద్యుడిగా అభివర్ణించారు. ఒలింపిక్స్‌లో మూడు స్వర్ణ పతకాలు సాధించిన గొప్ప క్రీడాకారుడని పీవో కొనియాడారు.



పాడేరు ఐటీడీఏలో గిడుగు రామ్మూర్తి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఐటీడీఏ పీవో ఆర్.గోపాలకృష్ణ

తెలుగు భాషపై మక్కువ పెంచుకోవాలి

తెలుగు భాషపై విద్యార్థులు మక్కువ పెంచుకోవాలని జిల్లా విద్యాశాఖ అధికారి డాక్టర్ రమేష్ తెలిపారు. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మాతృభాష, క్రీడా దినోత్సవాలను సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ఆవరణలో నిర్వహించిన సదస్సులో ఆయన మాట్లాడారు. అనంతరం పలు పోటీల్లో విజేతలకు డీఈవో బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయనను హెచ్ఎం కృష్ణమూర్తి, ఉపాధ్యాయులు కేశవరావు తదితరులు ఘనంగా సన్మానించారు.



గిడుగు రామ్మూర్తి, ధ్యాన్‌చంద్ చిత్రపటాల వద్ద జ్యోతి వెలిగించి నివాళి అర్పిస్తున్న డీఈవో డాక్టర్ రమేష్

ఏజెన్సీలో క్రీడల అభివృద్ధికి కృషి

- రంపచోడవరం ఐటీడీఏ పీవో సూరజ్ గనోరే



విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శన

గంగవరం: ఏజెన్సీలో క్రీడల అభివృద్ధికి, గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలకు అవసరమైన క్రీడా సామగ్రిని సరఫరా చేసేందుకు కృషి చేస్తానని, గిరిజన బాలబాలికలు విద్యాక్రీడా రంగాల్లో రాణించాలని రంపచోడవరం ఐటీడీఏ పీవో సూరజ్ గనోరే అన్నారు.స్థానిక గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలికోన్నత పాఠశాలలో సోమవారం జరిగిన జాతీయ క్రీడా, భాషా దినోత్సవాల్లో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా హాకీ క్రీడాకారుడు. ధ్యాన్ చంద్, వ్యహారిక భాషా పితామహుడు గిడుగు వెంకట రామ్మూర్తి చిత్ర పటాలకు పూలమాలలు వేసి నివాలర్పించారు. జాతీయ క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకుని పాఠశాలలో నిర్వహించిన పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. అనంతరం మాట్లాడుతూ గిరిజన బాలబాలికలు క్రీడల్లో రాణించాలని తెలిపారు. తాను, తన కుటుంబం కూడా క్రీడల్లో నైపుణ్యం సాధించిన వారమేనని తెలిపారు. తాను ఐఏఎస్ క్రికెట్ టీమ్‌లో సభ్యుడిగా ఉన్నానని ఆయన గుర్తు చేశారు.గిరిజన విద్యాభివృద్ధికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎంతో కృషి చేస్తున్నాయని, గిరిజనులు ఉన్నత విద్యావంతులుగా ఎదగాలన్నారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. పాఠశాల హెచ్ఎం ఝాన్సీ హేన్సన్ పాఠశాలల నెలకొన్న డ్రైనేజీ, ఆర్వో వాటర్ ప్లాంట్ సమస్యలను పీవో దృష్టికి తీసుకెళ్లారు. అనంతరం పలువురు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల క్రీడా మైదాన అభివృద్ధి కోసం విన్నవించారు.



మాట్లాడుతున్న పీవో సూరజ్ గనోరే

ఆకట్టుకున్న ప్రదర్శనలు

ఈ సందర్భంగా గిరిజన బాలికలు ప్రదర్శించిన వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు, యోగా ప్రదర్శనలు ఆకట్టుకొన్నాయి. కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించిన సహాయ గిరిజన సంక్షేమాధికారి ఎం.హాసని, ప్రధానోపాధ్యాయురాలు ఝాన్సీహేన్సన్ పీడీ జి.నాగమణి, పీఈటీ పద్మావతి, డిప్యూటీ వార్డెన్ లక్ష్మీకాంత ఉపాధ్యాయులు ను పీవో అభినందించారు.

శరవేగంగా

ఎన్‌హెచ్ నిర్మాణం



పాడేరు సమీపంలోని చింతలవీధిలో పూర్తయిన జాతీయరహదారి పనులు

▶1వ పేజీ తరువాయి

ఆనుకునే జాతీయ రహదారి నిర్మించాలని నిర్ణయించారు. అనంతగిరి మండలం చిలకలగెడ్డ, బొడ్డవర మీదుగా విజయనగరం వరకు జాతీయ రహదారి నిర్మాణానికి కూడా భూముల సర్వే పూర్తయింది.

పారదర్శకంగా సర్వే



పాడేరు డివిజన్ పరిధిలోని కొయ్యూరు నుంచి పాడేరు, అనంతగిరి నుంచి చిలకల గెడ్డ మీదుగా బొడ్డవర జంక్షన్ వరకు జాతీయ రహదారి నిర్మాణానికి భూముల సర్వేను పారదర్శకంగా చేపడుతున్నాం. గిరిజన రైతుల నుంచి అభిప్రాయాలను సేకరిస్తున్నాం. జాతీయ రహదారి నిర్మాణంలో భూములుకోల్పోయిన వారికి నష్టపరిహారం చెల్లించేందుకు చర్యలు తీసుకుంటున్నాం.

– వి.అభిషేక్, సబ్ కలెక్టర్, పాడేరు

కార్నియా బాధితులకు వెలుగు

- ప్రభుత్వ ప్రాంతీయ కంటి ఆస్పత్రిలో మళ్లీ కనుగుడ్డు మార్పిడి ఆపరేషన్లు
- ఆపరేషన్లకు ఆరోగ్యశ్రీ వర్తింపు



కార్నియా పరీక్షిస్తున్న డాక్టర్ విశ్వామిత్ర

సీతంపేట (విశాఖ, ఉత్తర): కార్నియా బాధితుల కళ్లల్లో వెలుగులు నింపుతున్నారు ప్రభుత్వ ప్రాంతీయ కంటి ఆస్పత్రి (ఆర్ఈహెచ్) వైద్యులు. కరోనా కారణంగా ప్రభుత్వ ప్రాంతీయ కంటి ఆస్పత్రిలో చాలా కాలంగా నిలిచిపోయిన కనుగుడ్డు మార్పిడి ఆపరేషన్లు తిరిగి ప్రారంభమయ్యాయి. ఇటీవల ఆస్పత్రి సూపరింటిండెంట్‌గా బాధ్యతలు స్వీకరించిన డాక్టర్ పెనుమల విశ్వామిత్ర ఆధ్వర్యంలో ఆపరేషన్లు చేస్తున్నారు. కార్నియా చెడిపోవడంవల్ల చూపు కోల్పోయిన వృద్ధురాలికి గత శనివారం కార్నియా మార్పిడి చేశారు. అవసరమైన వారు కార్నియా మార్పిడి సౌలభ్యాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఆపరేషన్లకు ఆరోగ్య శ్రీ వర్తిస్తోందని డాక్టర్ విశ్వామిత్ర తెలిపారు.

కార్నియా అంధత్వం అంటే..


కంటి పాపపై అద్దంలా ఉండే పొరని కార్నియా అంటారు. వ్యాధి లేదా గాయం వంటి ఏ కారణం చేతనైనా కార్నియా పారదర్శకతను కోల్పోతే కంటి చూపు తగ్గిపోవడం, పూర్తిగా చూపు పోయి అంధత్వం వస్తుంది.

కార్నియా దృష్టి హీనతకు కారణాలు

దెబ్బ లేదా గాయం కావడం, పోషకాహార లోపం, అంటు వ్యాధి సంభవించడం, రసాయనిక పదార్థాల వల్ల జరిగే ప్రమాదాలు, వంశపారపర్యం, ఆపరేషన్ తర్వాత వచ్చే ఇన్‌ఫెక్షన్ వల్ల కార్నియా పారదర్శకతను కోల్పోతుంది. ఫలితంగా చూపు మందగించి అంధత్వానికి దారి తీస్తుంది.

ఒకరి నేత్ర దానంతో ఇద్దరికి వెలుగు

ఒకరు నేత్రదానం చెయ్యడం ద్వారా చూపు లేని ఇద్దరికి నేత్రజ్యోతి వెలిగించవచ్చు. నేత్ర దానం చెయ్యడం ద్వారా మరణించాక కూడా జీవించవచ్చు. నేత్ర దానం చేసేందుకు సమీప కంటి బ్యాంకుకు గాని, రామాటాకీస్ సమీపంలో ప్రభుత్వ ప్రాంతీయ కంటి ఆస్పత్రికి గాని సంప్రదించవచ్చు. రక్తపోటు, మధుమేహం, ఉబ్బసం, కళ్ల జోడు పెట్టుకునే వారు, క్యాటరాక్ట్ ఆపరేషన్ చేయించుకున్న వారు కూడా కార్నియా దానం చెయ్యవచ్చు, హార్ట్ అటాక్‌తో చనిపోయిన వారు, రోడ్డు ప్రమాదాలలో మరణించిన వారి నేత్రాలను కూడా దానం చెయ్యవచ్చు.



కార్నియా మార్పిడి ఆపరేషన్ తర్వాత

సంప్రదించాల్సిన ఫోన్ నంబర్లు

నేత్ర దానం చెయ్యడానికి ప్రభుత్వ ప్రాంతీయ నేత్ర వైద్యశాల, రామా టాకీస్‌రోడ్, 0891 2552544, 2511238 నంబర్లకు సంప్రదించవచ్చు.

అలాగే టోల్ ఫ్రీ నంబరు : 1053.

క్లుప్తంగా...

పదోతరగతి, ఇంటర్ ఓపెన్ స్కూళ్లలో ప్రవేశాలు

అనకాపల్లిటౌన్ : రాష్ట్ర సార్వత్రిక విద్యాపీఠం (ఓపెన్ స్కూల్) అమరావతి 2022–2023 విద్యా సంవత్సరానికి పదో తరగతి, ఇంటర్‌లో ప్రవేశాలకు అవకాశం కల్పించినట్టు జిల్లా విద్యాశాఖ అధికారి బి.లింగేశ్వరరెడ్డి సోమవారం పేర్కొన్నారు. ఓపెన్ స్కూల్లో ప్రవేశాలకు సెప్టెంబర్ 1 నుంచి అక్టోబర్ 7వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో అపరాధ రుసుము లేకుండా చేరవచ్చని చెప్పారు. రూ.200 అపరాధ రుసుముతో అక్టోబర్ 26వ తేదీ వరకూ ప్రవేశాలకు ప్రభుత్వం అనుమతి ఇచ్చిందన్నారు. మరిన్ని వివరాలకు జిల్లా కో ఆర్డినేటర్ కుమార్ సెల్ 9441392098 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

20 కిలోల గంజాయితో ఒకరు అరెస్టు

మరొకరు పరార్

సాక్షి, పాడేరు : అడారిమెట్ట జంక్షన్‌లో ద్విచక్రవాహనంలో తరలిస్తున్న 20 కిలోల గంజాయి పట్టుబడిందని స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో సీఐ సంతోష్ సోమవారం విలేకరులకు తెలిపారు. ముందస్తు సమాచారంతో వాహనాలు తనిఖీ చేస్తుండగా అనుమానాస్పదంగా ద్విచక్ర వాహనంపై ప్రయాణిస్తున్న ఇద్దరు వ్యక్తులను గంజాయితో పాటు పట్టుకున్నామన్నారు. వారిలో ఒకరు మహిళ కాగా ఆమె పరారైందన్నారు. పట్టుబడ్డ కేరళకు చెందిన వ్యక్తిని అరెస్టు చేసి అతని వద్ద ఫోన్ స్వాధీనం చేసుకుని, రిమాండ్‌కు తరలించామని, పరారైన మహిళ పూజారి దేవి కోసం గాలిస్తున్నామని అన్నారు. ఎస్ఐ టి.సురేష్‌కుమార్, సిబ్బంది రామకృష్ణ, కిరణ్‌కుమార్ పాల్గొన్నారు.

బాలికపై అత్యాచార ఘటనలో ఒకరు అరెస్టు

సాక్షి,పాడేరు : ఇటీవల ఓ మైనర్ బాలికను ప్రేమ పేరుతో నమ్మించి విజయవాడ తీసుకువెళ్లి అత్యాచార ఘటనకు పాల్పడిన నిందితుడిని సోమవారం అరెస్టు చేసామని పాడేరు సీఐ సుధాకర్ తెలిపారు. ఆయన విలేకరులతో మాట్లాడుతూ హుకుంపేట మండలం గడికించుమండ గ్రామానికి చెందిన బంగరు వినోద్‌కుమార్‌ను ఈ కేసులో అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించామన్నారు. మైనర్ బాలికను ప్రేమించడం, వివాహం చేసుకోవడం తీవ్రమైన నేరమని, అలాంటి ఘటనకు పాల్పడే నిందితులపై పోక్సో కేసు నమోదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని సీఐ హెచ్చరించారు.

ఇద్దరు వలంటీర్లకు ఉద్వాసన

నక్కపల్లి: ముకుందరాజుపేటలో విధుల పట్ల నిర్లక్ష్యం వహించిన ఇద్దరు వలంటీర్లను విధుల నుంచి తొలగించినట్టు ఎంపీడీవో సీతారామరాజు తెలిపారు. ఆ గ్రామంలో కొద్దిరోజు క్రితం గడప గడపకు ప్రభుత్వ కార్యక్రమం జరిగింది. పాయకరావుపేట శాసనసభ్యుడు గొల్ల బాబూరావు ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఈ కార్యక్రమానికి వలంటీర్లు ఇసరపు అప్పలరాజు, దాకారపు రమణ మాణిక్యం గైర్హాజరయ్యారు. అలాగే ప్రభుత్వం పేదలకు అమలు చేస్తున్న వివిధ సంక్షేమ పథకాలను తెలియజేస్తూ పంపిణీ చేసిన బ్రోచర్లను లబ్ధిదారులకు ఇవ్వకపోవడం ఎమ్మెల్యే పాల్గొన్న ప్రభుత్వ కార్యక్రమానికి హాజరు కాకపోవడం పట్ల అధికారులు తీవ్రంగా పరిగణించారు. ముందస్తు అనుమతి లేకుండా ప్రోటోకాల్ విస్మరించిన కారణంగా కలెక్టర్ ఆదేశాలు, కార్యదర్శి సూచనల మేరకు ఈ ఇద్దరు వలంటీర్లను విధుల నుంచి పూర్తిగా తొలగించడం జరిగిందన్నారు. ప్రభుత్వం నోటిఫికేషన్ విడుదల చేసిన తర్వాత కొత్తవారి నియామకానికి చర్యలు చేపడతామన్నారు.

దొరగూడలో రాష్ట్ర పశు వైద్య బృందం పర్యటన

- వాగులు దాటి వెళ్ళిన అధికారులు
- మేకలు, పశువుల మృతిపై ఆరా, శాంపిల్స్ సేకరణ
- మరో దఫా అనుమానితుల రక్త నమూనాల సేకరణ



పశువు నుంచి శాంపిల్స్ తీస్తున్న రాష్ట్ర పశు సంవర్ధక శాఖ బృందం



దొరగూడ గిరిజనులకు నిత్యావసర సరుకులు అందిస్తున్న రెవెన్యూ అధికారులు

ముంచంగిపుట్టు : లక్ష్మీపురం పంచాయతీ అత్యంత మారుమూల గ్రామమైన దొర గూడ గ్రామంలో ఆంత్రాక్స్ వ్యాధి లక్షణాలతో ఏడుగురు గిరిజనులు బాధపడుతున్న విషయం తెలుసుక్ను రాష్ట్ర పశు సంవర్ధకశాఖ బృందం సోమవారం ఆ గ్రామంలో పర్యటించారు. రాష్ట్ర హెల్త్ ఆర్గనైజేషన్ డాక్టర్ రమ్య ఆంత్రాక్స్ లక్షణాలు ఉన్న బాధితులను పరిశీలించారు. శరీరంలో కురుపులు వ్యాప్తి, తినే ఆహారం, వాడే నీటిపై అడిగి తెలుసుకున్నారు. మేకలు, పశువుల శాలలను పరిశీలించి, వ్యాధుల బారిన పడుతున్నాయా, గతంలో మేకలు ఏ విధంగా చనిపోయాయి అనే విషయం ఆరా తీశారు. రెండు నెలల వ్యవధిలో 40 మేకలు విరోచనాలతో మృతి చెందగా వాటిని తినడం వల్లనే తమకు శరీరం అంతా కురుపులు వచ్చాయా, అది ఆంత్రాక్స్ అనే భయం వేస్తుందని గ్రామస్తులు తెలిపారు. దీంతో 15 పశువుల డంగ్ (పేడ), మట్టి నమూనాలు, నీరు శాంపిల్స్‌ను వైద్య సిబ్బంది సేకరించారు. గ్రామస్తులకు పశువుల సంరక్షణ, వ్యాధుల బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సూచనాలు చేశారు. విజయవాడకు చెందిన ఆంత్రాక్స్ నమూనాలు సేకరణకు వచ్చి రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ అధికారులు సైతం మారో దఫా ఆంత్రాక్స్ అనుమానితుల కురుపుల వద్ద నుంచి రక్త నమూనాలు సేకరించారు. గ్రామంలో ప్రత్యేక వైద్య శిబిరం నిర్వహించి, మందులు అందించారు. జిల్లా కలెక్టర్ ఆదేశాలతో రెవెన్యూశాఖ అధికారులు దొరగూడ గ్రామంలో 17 కుటుంబాలకు బియ్యం, కందిపప్పు, నూనె వంటి నిత్యావసర సరుకులను పంపిణీ చేశారు. మండల సీపీఎం నేతలు సైతం దొరగూడ వెళ్లే అనుమానితులను పరామర్శించారు. మైక్రో బయాలజిస్ట్ ధనరాజు, ఆర్ఏడీడీఎల్ డాక్టర్ నాగవల్లి, లక్ష్మీపురం సర్పంచ్ కె.త్రినాథ్, వైస్ ఎంపీపీ సత్యనారాయణ, లబ్బూరు వైద్యాధికారి ప్రతాప్ పాల్గొన్నారు.

కట్న వేధింపుల కేసులో భర్త, మామలకు జైలు

- రెండు సెక్షన్లలో 8 ఏళ్ల జైలు, రూ. 2వేలు జరిమానా
- ఏక కాలంలో శిక్ష అమలుతో ఐదేళ్ల జైలు, రూ.2వేలు జరిమానా
- తీర్పు చెప్పిన చోడవరం సీనియర్ సివిల్ జడ్జి

చోడవరం : వరకట్నం కోసం వేధిస్తూ చివరికి భార్యను ఆత్మహత్య చేసుకునే విధంగా చిత్రహింసలకు గురిచేసిన భర్త, మామకు ఐదేళ్ల జైలు శిక్ష, రూ.2 వేలు జరిమానా విధిస్తూ చోడవరం సీనియర్ సివిల్ జడ్జి ఎస్.అరుణ శ్రీ సోమవారం తీర్పు చెప్పారు. ఈ కేసుకు సంబంధించి వివరాలిలావున్నాయి... 2015డిసెంబరు 10వ తేదీన చోడవరం మండలం లక్కవరం గ్రామానికి చెందిన దొమ్మేసి కామరాజు చోడవరం చెందిన లీలా ప్రసన్నతో పెద్దలు కుదిర్చిన వివాహం జరిగింది. కొంత కాలం సజావుగా జరిగిన వీరి కాపురం తర్వాత భర్త కామరాజు తరుచూ తాగివచ్చి భార్యపై శారీరకంగాను, మానసికంగానూ వేధిస్తూ కొడుతూ చిత్రహింసలకు గురిచేసేవాడు. ఈ వేధింపులు భరించలేక 2016సెప్టెంబరు 9వతేదీన అత్తవారి ఇంట్లోనే తలుపువేసుకొని ఒంటిపై కిరోసిన్ పోసుకొని ఆత్మహత్య చేసుకుంది. తీవ్రగాయాలపాలైన లీలాప్రసన్నను చికిత్స నిమిత్తం కేజీహెచ్‌కు తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మృతిచెందింది. దీంతో ఆమె తండ్రి జలాడి కమలేశ్వరరాజు చోడవరం పోలీసులకు ఫిర్యాదు చేయడంలో అప్పటి ఎస్ఐ నర్సింహమూర్తి కేసు నమోదు చేసి దర్యాప్తు చేశారు. 306ఐపీసీ, 498(ఎ)సెక్షన్లు నమోదు చేశారు. చోడవరం సీనియర్ సివిల్‌జడ్జి అరుణశ్రీ ఈ కేసును విచారణ చేశారు.

మృతురాలి భర్తకు మామ మహాలక్ష్మి కూడా సహకారం అందించినట్టు సాక్షుల విచారణలో నేరం రుజువైంది. నిందితులిద్దరికీ రెండు కేసుల్లో వేర్వేరుగా శిక్ష విధించినప్పటికీ ఏక కాలంలో శిక్ష అమలు చేయాలని న్యాయమూర్తి తీర్పు చెప్పారు. 306 సెక్షన్ కింద నిందితులిద్దరికీ ఐదేళ్ల జైలు శిక్ష రూ. ఒక్కొక్కరికి వెయ్యి చొప్పున రెండువేలు జరిమానా విధించారు. 498(ఎ)సెక్షన్‌కు మూడేళ్లు జైలు శిక్ష విధించారు. రెండూ కలిసి ఎనిమిదేళ్లు జైలు శిక్ష విధించగా ఏకకాలంలో ఈ రెండు శిక్షలు అమలు చేయడం వల్ల ఐదేళ్ల జైలు, రూ .2వేలు జరిమానా విధిస్తూ న్యాయమూర్తి అరుణశ్రీ తీర్పు చెప్పారు. అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ వేచలపు వెంకట్రావు కేసును వాదించారు. కూతురు ఆత్మహత్యకు కారణమైన వారికి శిక్ష పడడంపై లీలా ప్రసన్న తల్లిదండ్రులు, కుటుంబసభ్యులు తమకు న్యాయం జరిగిందని తెలిపారు.

అయ్యన్నా... సీఎం ఇంటిని ముట్టడించే దమ్ముందా!

సవాల్ విసిరిన ఎమ్మెల్యే ఉమాశంకర్‌గణేష్



మాట్లాడుతున్న ఎమ్మెల్యే గణేష్

నర్సీపట్నం : సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఇంటిని ముట్టడించే దమ్ము మాజీ మంత్రి అయ్యన్నపాత్రుడికి ఉందా? అని నర్సీపట్నం ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్‌గణేష్ ప్రశ్నించారు. మీడియాకు ఎమ్మెల్యే సోమవారం ఒక వీడియోను విడుదల చేశారు. ఈ వీడియోలో అయ్యన్నపై తీవ్ర విమర్శలు చేశారు. పదే పదే సీఎంపై అయ్యన్న విమర్శలు చేస్తున్నాడని, కుప్పంలో అన్న క్యాంటీన్ పెడితే దౌర్జన్యం చేస్తున్నారనడం హాస్యాస్పదంగా ఉందన్నారు. 2014 ఎన్నికల ముందు రాష్ట్ర వ్యాప్తంగా అన్నా క్యాంటీన్‌లు ఏర్పాటు చేస్తామని చెబితే ప్రజలు గెలిపించారన్నారు. నాలుగున్నర ఏళ్లు ఈ క్యాంటీన్లు పెట్టలేదని, ఎన్నికలు ఆరు నెలల్లో ఉన్నాయనగా పెట్టారన్నారు. అధికారంలో ఉన్నపుడు వేల కోట్లు దోచుకున్నారని, ఒక్క కుప్పంలోనే కాకుండా 175 నియోజకవర్గాల్లోనూ అన్నా క్యాంటీన్‌లు పెట్టాలని చంద్రబాబును అయ్యన్న ప్రశ్నించాలన్నారు. టీడీపీ హయాంలో రౌడీ, గూండాయిజాలు ఉండేవని, జగన్ ప్రభుత్వంలో అలాంటివి లేవన్నారు. ప్రస్తుతం ఉన్నది ఎన్టీఆర్ తెలుగుదేశం పార్టీ కాదన్నారు. ఎన్టీఆర్‌ను వెన్నుపోటు పొడిచింది చంద్రబాబు, అయ్యన్నపాత్రుడేనన్నారు. సోనియా గాంధీ వంటి నాయకులను ఎదిరించిన దమ్మున్న నాయకుడు జగన్ మోహన్‌రెడ్డి అన్నారు. నల్లజర్ల నుంచి పోలీసులు వస్తే అయ్యన్న ఇంట్లో పిల్లిలా దాక్కున్నాడని, అక్రమంగా కట్టిన గోడను కూలిస్తే 20 రోజులపాటు ఎక్కడో దాక్కుని స్టే తెచ్చుకున్నాడని విమర్శలు చేశారు. అయ్యన్న వంటి వాళ్లు రోడ్డెక్కి సీఎం దగ్గరకి వెళితే బట్టలూడదీసి కొడతారన్న విషయాన్ని తెలుసుకోవాలన్నారు. అయ్యన్నకు దమ్ము ధైర్యం ఉంటే సీఎం జగన్ ఇంటికి బయలుదేరాలని, ఆరోజు నర్సీపట్నం నియోజకవర్గం నుంచి ఒక్క అడుగు కూడా బయటపెట్టనివ్వమని అన్నారు.

గుర్తుతెలియని మృతదేహం లభ్యం

చోడవరం : గుర్తుతెలియని వ్యక్తి మృతదేహాన్ని చోడవరం పోలీసులు సోమవారం గుర్తించారు. బీఎన్‌రోడ్డులో చోడవరం నుంచి గజపతినగరం వెళ్లే రోడ్డులో బంగ్లా సమీపంలో 45 ఏళ్ల వయస్సు కలిగిన వ్యక్తి మృతదేహాన్ని గుర్తించారు. మృతుడు టీ షర్టు, ఆఫ్ నిక్కరు వేసుకుని ఉన్నట్టు ఎస్ఐ విభూషణరావు తెలిపారు. సాధారణ మృతిగానే భావిస్తున్నామని, వివరాలకు చోడవరం పోలీసు స్టేషన్‌ను సంప్రదించాలని కోరారు. మృతదేహాన్ని పోస్టుమార్టం గదిలో భద్రపరిచారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని చెప్పారు.

బీసీటీకి లీజు పునరుద్ధరణ జరగదు

యలమంచిలి ఎమ్మెల్యే రమణమూర్తిరాజు

రాంబిల్లి: హరిపురం, పంచదార్ల రెవెన్యూ పరిధిలో గల సుమారు 100 ఎకరాల భూములను భాగవతుల చారిటబుల్ ట్రస్టు(బీసీటీ)కి మరోసారి లీజు పునరద్ధరణ జరగదని ఎమ్మెల్యే యు.వి.రమణమూర్తిరాజు(కన్నబాబు) స్పష్టం చేశారు. బీసీటీకి లీజు గడువు ముగిసి కొన్నేళ్లు గడిచిందన్నారు. రూ.కోట్లు విలువైన ఈ భూములను ఆయా సంస్థకు లీజుకు ఇచ్చే ప్రసక్తే లేదన్నారు. ఈ గ్రామానికి చెందిన మాజీ రోమాల మూలరాజుతో పాటు పలువురు గ్రామస్తులు బీసీటీ సంస్థ ఈ భూములకు సంబంధించి లీజు గడువు ముగిసినా ఆయా భూములను ఇంకా వారి ఆధీనంలోనే వున్నట్లు వ్యవహరించడంపై ఎమ్మెల్యేకు ఫిర్యాదు చేశారు. దీనిపై స్పందించిన ఎమ్మెల్యే సోమవారం వెంకటాపురంలో విలేకరులతో మాట్లాడుతూ, ఈ విలువైన భూములను యూనివర్శిటీకి కేటాయించేందుకు జిల్లా కలెక్టర్‌తో మాట్లాడినట్లు పేర్కొన్నారు.

ఘాట్ రోడ్డులో నిలిచిన ట్రాఫిక్



ఘాట్ రోడ్డులో నిలిచిపోయిన లారీ

మారేడుమిల్లి : మారేడుమిల్లి–చింతూరు ఘాట్ రోడ్డులో సోమవారం ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. కాకినాడ నుంచి మారేడుమిల్లి మీదుగా భద్రాచలం వెళ్తున్న లోడ్ లారీ పాములేరు గ్రామం దాటిన తరువాత ఇజ్జలూరు జంక్షన్ వద్ద మలుపులో సాంకేతిక లోపంతో ఆగిపోవడంతో ఇరువైపులా భారీ వాహనాలు, ఆర్టీసీ బస్సుల రాకపోకలు నిలిచిపోయాయి. దీంతో వాహనదారులు, ప్రయాణికులు రోడ్డుపైనే పడిగాపులు కాస్తూ తీవ్ర ఇబ్బందులు పడ్డారు.

సంతలో సీఆర్‌పీఎఫ్ సేవలు

వై.రామవరం: సివిక్ యాక్షన్ ప్రోగ్రాంలో బాగంగా వై.రామవరం వారపు సంతలో సోమవారం సీఆర్‌పీఎఫ్ డి42 బెటాలియన్ అదనపు పోలీసు బలగాల ఆధ్వర్యంలో పేదలకు భోజనం సమకూర్చారు. వారపు సంతతో పాటు వివిధ పనులపై వచ్చిన సుమారు 200 మంది పేదలకు భోజనం, వాటర్ ప్యాకెట్లను అందజేశారు. సీఆర్‌పీఎఫ్ డి42 బెటాలియన్ అసిస్టెంట్ కమాండెంట్ జి.ఎల్.నాయుడు, ఇన్‌స్పెక్టర్ వెంకటమణ, సిబ్బంది పాల్గొన్నారు.



వారపు సంతలో పేదలకు భోజనం ప్యాకెట్లు పంపిణీ చేస్తున్న సీఆర్‌పీఎఫ్ సిబ్బంది

ప్రజా సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట

- మావోయిస్టు ప్రభావిత ప్రాంతంలో ఎమ్మెల్యే కొట్టగుల్లి భాగ్యలక్ష్మి విస్తృత పర్యటన
- గడప గడప కార్యక్రమంలో ప్రభుత్వ పథకాల అమలుపై ఆరా



లక్కవరంలో గ్రామస్తులకు ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరిస్తున్న పాడేరు ఎమ్మెల్యే కొట్టగుల్లి భాగ్యలక్ష్మి



గ్రామంలో పర్యటిస్తున్న ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి, నేతలు

గూడెంకొత్తవీధి : మావోయిస్టు ప్రభావిత గ్రామాల్లో పాడేరు ఎమ్మెల్యే కొట్టగుల్లి భాగ్యలక్ష్మి సోమవారం పర్యటించారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ద్వారా గిరిజనులకు ప్రభుత్వ పథకాల అమలుతీరును ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి తెలుసుకున్నారు. మండలంలోని మావోయిస్టు ప్రభావిత గ్రామాల్లో దేవరాపల్లి పంచాయతీ లక్కవరం, సాగుల, బూసుల, ఈతరెబ్బలు, మల్లికార్జుల గ్రామాల్లో గడప గడప కార్యక్రమం ద్వారా 175 గడపలకు ఇంటింటికి వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ కార్యక్రమాల అమలును ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి సమీక్షించారు. సమీప గ్రామాలైన పెదపాడు, మెట్టగూడ, చీడిగొంది, ఎర్రగెడ్డ గ్రామస్తులతో ఎమ్మెల్యే సమావేశమయ్యారు. ప్రభుత్వ పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రం, రహదారి కోసం ఆయా గ్రామస్తులు ఎమ్మెల్యేకు విన్నవించారు. దీనిపై స్పందించిన ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరిస్తామని గిరిజనులకు హామీ ఇచ్చారు. చిన్నారులతో ముచ్చటించారు. దీంతో ఇప్పటి వరకు ఏ ప్రజాప్రతినిధి రాలేదని, మీరు వచ్చి తమ సమస్యలను పరిష్కరించేందుకు హామీ ఇవ్వడం సంతోషంగా ఉందని గిరిజనులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కొట్టగుల్లి భాగ్యలక్ష్మి మాట్లాడుతూ గిరిజనుల అభ్యున్నతికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విశేష కృషి చేస్తున్నారన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమానికి డుమ్మా కొట్టిన అధికారులపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామని ఎమ్మెల్యే చెప్పారు. ఇలాంటి కార్యక్రమానికి అధికారులు హాజరు కాకపోవడం సరికాదన్నారు. రానున్న ఎన్నికల్లో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి మరోసారి ఆశీర్వదించాలని ఎమ్మెల్యే గిరిజనులను కోరారు. ఎంపీపీ బోయిన కుమారి, వైస్ ఎంపీపీ దేముడు, చింతపల్లి, జి.కె.వీధి జెడ్పీటీసీలు పోతురాజు బాలయ్య, శివరత్నం, చింతపల్లి మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ జల్లి హలియారాణి, పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జి ప్రసాద్, చింతపల్లి, జి.కె.వీధి మండల పార్టీ అధ్యక్షుడు రవి, లక్ష్మణ్, కో–ఆప్షన్ సభ్యుడు దావూద్, సర్పంచులు రామకృష్ణ, బుజ్జిబాబు, నాగరాజు, సుభద్ర, పండు, కాసులమ్మ, ఎంపీటీసీలు నాగమణి, సత్యనారాయణ, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

సమావేశానికి అధికారుల గైర్హాజరుపై ఆగ్రహం

అరకులోయ రూరల్ : ఎంపీపీ రంజపల్లి ఉషారాణి అధ్యక్షతన ఎంపీడీవో వెంకటేష్ ఆధ్వర్యంలో సోమవారం మండల సర్వసభ్య సమావేశం జరిగింది. సమావేశానికి అధికారులు హాజరుకాకపోవడంపై ఎంపీపీ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆమె మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కార వేదికగా నిర్వహిస్తున్న సమావేశానికి అధికారులు హాజరుకాకపోవడం సరికాదన్నారు. గతంలో నిర్వహించిన సమావేశంలో కూడా విద్యుత్ శాఖ, ఆర్అండ్‌బీ, పశు సంవర్ధక తదితర శాఖలకు చెందిన అధికారులు రాలేదన్నారు. సమావేశానికి గైర్హాజరైన అధికారులపై చర్యలకు ఉన్నతాధికారులు శాఖాపరమైన చర్యలు తీసుకోవాలన్నారు. పూర్తిస్థాయిలో అధికారులు హాజరుకాకపోవడంపై పలువురు సభ్యులు సమావేశాన్ని బహిష్కరించారు. సమస్యలు పరిష్కరించడంలో అధికారులు నిర్లక్ష్యం తగదని సభ్యులు ధ్వజమెత్తారు.



మాట్లాడుతున్న ఎంపీపీ ఉషారాణి

అధికారుల తీరుపై సభ్యులు నిరసన తెలిపారు. ప్రభుత్వం అన్ని వర్గాలకు సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నా అధికారులు పర్యవేక్షణ లేక ప్రజలకు సక్రమంగా అందడం లేదన్నారు. తహసీల్దార్ వేణుగోపాల్, జెడ్పీటీసీ రోషిణి, వైస్ ఎంపీపీలు రామన్న, సుమాంజలి, సభ్యులు ఆనంద్‌కుమార్, రామచందర్, కుమారి, కో–ఆప్షన్ సభ్యుడు రహమ్‌తుల్లా పాల్గొన్నారు.

విద్యార్థులు క్రీడల్లో రాణించాలి



క్రీడాకారుడు పవన్‌కుమార్‌ను సన్మానిస్తున్న టీచర్లు

పెదబయలు: విద్యార్థులు పాఠశాల స్థాయి నుంచి క్రీడల్లో రాణించాలని అంతర్జాతీయ షటిల్ బ్యాడ్మింటన్ క్రీడాకారుడు పవన్‌కుమార్ అన్నారు. గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలూరు పాఠశాలలో జరిగిన క్రీడా దినోత్సవం, తెలుగు భాషా దినోత్సవంలో ఆయన పాల్గొన్నారు. విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని కోరారు. తాను హుకుంపేట పాఠశాలలో అభ్యసించి, ఈ స్థాయిలో రాణించడానికి హెచ్‌ఎం నాగేశ్వరరావు తోడ్పాటునందించారన్నారు. జాతీయ పతాకం, క్రీడా పతాకాన్ని హెచ్‌ఎం నాగేశ్వరరావు, తల్లిదండ్రుల కమిటీ అధ్యక్షురాలు హైమావతి ఆవిష్కరించారు. కార్యక్రమంలో భాగంగా గిడుగు రామ్మూర్తి పంతులు, ప్రముఖ క్రీడా కారుడు ధ్యాన్‌చంద్ చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అంతర్జాతీయ క్రీడల్లో బంగారు పతకం సాధించిన పవర్‌కుమార్‌ను ఘనంగా సన్మానించారు. తెలుగు భాషా దినోత్సవాన్ని నిర్వహించారు.

చికెన్ ధరలు



చికెన్ (కిలో) (వెన్‌కాబ్)

బ్రాయిలర్ (లైవ్)	:రూ.120
స్కిన్	:రూ.210
స్కిన్‌లెస్	:రూ.220

కోడిగుడ్ల ధరలు

రూ.లలో (వందకు)

విశాఖ	425.00
విజయనగరం	429.00
శ్రీకాకుళం	429.00

బెల్లం ధరలు



అనకాపల్లి బెల్లం మార్కెట్‌కు సోమవారం 428 బెల్లం దిమ్మలు వచ్చాయి.

దిమ్మల రకం	కనిష్ట ధర	గరిష్ట ధర
మొదటి రకం	4,380	3,400
రెండో రకం	3,410	2,900
మూడో రకం	2,900	2,450

గ్రామాల అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం

అరుకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ

హుకుంపేట: గిరిజన గ్రామల అభివృద్ధే ధ్యేయంగా ప్రభుత్వం పనిచేస్తోందని అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ అన్నారు. మండలంలోని రంగశీల పంచాయతీ బోడిగాపుట్టు, బలోర్డా, ఇరుకువలస, నందివలస, టిటింగ్‌వలస, జామిగుడ గ్రామా ల్లో సోమవారం నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఆయా గ్రామాల్లో 253 గడపలను ఆయన సందర్శించారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలుతీరును అడిగి తెలుసుకున్నారు. ఆయా గ్రామాల్లో అంగన్‌వాడీ కేంద్రాలు, పాఠశాలలను సందర్శించి, రికార్డులు పరిశీలించారు. విద్యార్థులకు మెరుగైన బోధన అందించాలని, విధుల్లో నిర్లక్ష్యం వహించొద్దని ఉపాధ్యాయులకు ఎమ్మెల్యే పాల్గుణ సూచించారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా సకాలంలో, సక్రమంగా పౌష్టికాహారం అందజేయాలని సిబ్బందికి ఆదేశించారు. టిటింగ్‌వలస నుంచి బలియగూడ వరకు రోడ్డు కోసం స్థానికులు ఎమ్మెల్యేను విన్నవించారు. దీనిపై ఆయన స్పందించి, త్వరలో రోడ్డు మంజూ రు చేయిస్తానని హామీ ఇచ్చారు. బలోర్డా, బోడిగాపుట్టు గ్రామాల్లో కూడా రోడ్డు నిర్మిస్తామని ఎమ్మెల్యే భరోసా ఇచ్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ మాట్లాడు తూ గిరిజన గ్రామాల అభివృద్ధి కోసం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కోట్లాది రూపాయల నిధులు మంజూరు చేస్తున్నారని, గిరిజనుల అభ్యున్నతికి విశేష కృషి చేస్తున్నారన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను గిరిజనులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఎంపీపీ కూడా రాజుబాబు, జెడ్పీటీసీ సభ్యుడు రేగం మత్స్యలింగం, ఎంఈవో రామచంద్రరావు, సీడీపీవో బాలచంద్రమణిదేవి, ఏవో సరోజిని, ఏపీఎం కృష్ణారావు, ఏపీవో లింగమూర్తి, జిల్లా వ్యవసాయ సలహా మండలి సభ్యుడు ఎం.విశ్వేశ్వరరావు, ఎంపీటీసీ సభ్యులు సుశీల, ముత్యాలమ్మ, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శెట్టి గంగాధర్‌స్వామి, పార్టీ జిల్లా యువజన విభాగ ప్రధాన కార్యదర్శి నైని సత్తిబాబు, నాయకులు చిన్నబ్బి, రామరాజు తదితరులు పాల్గొన్నారు.



బలోర్డాలో గ్రామస్తులకు సంక్షేమ పథకాలపై అవగాహన కల్పిస్తున్న అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ, చిత్రంలో ఎంపీపీ రాజుబాబు, జెడ్పీటీసీ సభ్యుడు మత్స్యలింగం

క్లుప్తంగా...

బాల్య వివాహాలు చట్టరీత్యా నేరం



మాట్లాడుతున్న ఎంపీపీ శెట్టి నీలవేణి

అనంతగిరి: బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని ఎంపీపీ శెట్టి నీలవేణి అన్నారు. మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలోని చైల్డ్‌లైన్ అడ్వైజరీ బోర్డు ఆధ్వర్యంలో తహసీల్దార్ రాంబాయి అధ్యక్షత సోమవారం మండలస్థాయి కమిటీని ఎన్నుకున్నారు. కార్యక్రమంలో పాల్గొన్న ఎంపీపీ శెట్టి నీలవేణి మాట్లాడుతూ గ్రామస్థాయిలో బాల్యవివాహాలను అరికట్టేందుకు వలంటీర్లు, సచివాలయం సిబ్బంది కృషి చేయాలన్నారు. బాల్య వివాహాలపై 1098, 100 నంబర్‌కు సమాచారం ఇవ్వాలన్నారు. ఎస్ఐ కరక రాము, ఈవోపీఆర్డీ మల్లేశ్వరరావు, సీడీపీవో సంతోషికుమారి, జిల్లా కో–ఆర్డీనేటర్ డేవిడ్‌రాజు తదితరులు పాల్గొన్నారు.


ఎంఈవోల నియామకం



త్రినాథరావు



చెల్లయ్య



ప్రసాద్

దుంబ్రిగుడ: మండల విద్యాశాఖ అధికారిగా వంతల త్రినాథ్‌రావు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన మాట్లాడుతూ పాఠశాలల అభివృద్ధికి చర్యలు తీసుకొని, విద్యాభివృద్ధికి కృషి చేస్తా మ న్నారు. ఆయనకు పలువురు ఉపాధ్యాయులు కలిసి అభినందనలు తెలిపారు.

ముంచంగిపుట్టు: మండల విద్యాశాఖాధికారిగా ఎస్.చెల్లయ్య సోమవారం బాధ్యతలు స్వీకరించారు. కిలగాడ ప్రభుత్వ గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలుర పాఠశాల హెచ్‌ఎంగా ఆయన పనిచేశారు. ప్రభుత్వం చేపట్టే నాడు–నేడు పనులు సకాలంలో జరిగే విధంగా చూస్తానన్నారు. ఆయనకు పలువురు ఉపాధ్యాయులు కలిసి అభినందనలు తెలిపారు.

చింతపల్లి: చింతపల్లి ఎంఈవోగా పనసల ప్రసాద్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటివరకు ఇక్కడ కొయ్యూరు ఎంఈవో బోడెనాయుడు ఇన్‌చార్జ్ ఎంఈవోగా వ్యవహరించారు.

ఏజెన్సీ అభివృద్ధికి కృషి



సచివాలయాల ఉద్యోగుల సంఘ సభ్యులను సన్మానించిన అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ

సాక్షి,పాడేరు: అల్లూరి జిల్లా సచివాలయ ఉద్యోగుల కమిటీ అధ్యక్షుడు నానిపాత్రుడు, ఉపాధ్యక్షురాలు సత్యవతి తదితరులను అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ సోమవారం ఘనంగా సన్మానించారు. సచివాలయాల వ్యవస్థ ద్వారా గిరిజన ప్రాంతాల అభివృద్ధికి కృషి చేయాలని, సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఆశయ సాధన కోసం పనిచేయాలని కోరారు. సర్పంచ్ శ్యామ్‌సుందర్ తదితరులున్నారు.

ఘనంగా తెలుగు భాషా దినోత్సవం



అరకులోయ కళాశాలలో గిడుగు రామ్మూర్తి, ధ్యాన్‌చంద్ చిత్రపటాల వద్ద నివాళులర్పిస్తున్న ప్రిన్సిపాళ్లు, అధ్యాపకులు



ముంచంగిపుట్టులో గిడుగుకు నివాళులర్పిస్తున్న టీచర్లు



గిడుగు రామ్మూర్తి చిత్రపటం వద్ద ఉపాధ్యాయుల నివాళి

సాక్షి, పాడేరు: తెలుగు భాషా దినోత్సవాన్ని జిల్లాలోని అన్ని ప్రాంతాల్లో సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తెలుగు వ్యవహారిక భాషోద్యమ పితామహుడు గిడుగు వెంకట రామ్మూర్తి పంతులు జయంతిని జరుపుకున్నారు. విద్యాలయాల్లో జరిగిన కార్యక్రమాల్లో గిడుగు రామ్మూర్తి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. పలువురు మాట్లాడుతూ తెలుగు సాహిత్యాన్ని సరళీకరించి, తెలుగు తీయదనాన్ని సామాన్యుడికి చేరువచేసేందుకు గిడుగు రామ్మూర్తి ఎనలేని కృషి చేశారన్నారు. విద్యార్థులకు తెలుగు భాషా ఔన్నత్యాన్ని తెలియజేశారు. మన మాతృభాష తల్లి లాంటిదని, ప్రతి ఒక్కరూ మాతృభాషను గౌరవించి, అభివృద్ధికి కృషి చేయాలన్నారు.

అరకులోయ: ప్రభుత్వ డిగ్రీ కళాశాల, మహిళా డిగ్రీ కళాశాలల్లో జరిగిన కార్యక్రమంలో ప్రిన్సిపాళ్లు డాక్టర్ కె.భరతకుమార్ నాయక్, డాక్టర్ సీహెచ్.రామకృష్ణ, గిడుగు రామ్మూర్తి, హాకీ క్రీడాకారుడు ధ్యాన్‌చంద్ చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఎన్ఎస్ఎస్ పీవోలు నాగబాబు,విజయలక్ష్మి, అధ్యాపకులు పాల్గొన్నారు. పాడేరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ డాక్టర్‌వనుము చిట్టబ్బాయి, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ టి.ఎస్.రసూల్, అధ్యాపకులు పాల్గొన్నారు.

కొయ్యూరు: స్థానిక డిగ్రీ కాలేజీలో క్రీడా దినోత్సవాన్ని నిర్వహించారు. ప్రిన్సిపాల్ ఎస్‌కె హరూన్ పాల్గొన్నారు.

అనంతగిరి: కొత్తవలస గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలురు పాఠశాలలో జరిగిన వేడుకలో హెచ్ఎం భాస్కరరావు పాల్గొన్నారు.

ముంచంగిపుట్టు: గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలికల పాఠశాల–2లో జరిగిన కార్యక్రమంలో తెలుగు పద్యాలపై విద్యార్థులకు పోటీలు నిర్వహించి, బహుమతులు అందజేశారు. హెచ్ఎం పి.రాధాకృష్ణ, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

గూడెంకొత్తవీధి: జర్రెల ఆశ్రమ పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో హెచ్ఎం తదితరులు పాల్గొన్నారు.

రంపచోడవరం: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జరిగిన కార్యక్రమంలో విద్యార్థులకు వ్యాసరచన, క్రీడా పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులు అందజేశారు. ప్రిన్సిపాల్ డాక్టర్ వి.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

రాజవొమ్మంగి: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో హెచ్ఎం శ్రీనివాస్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో విద్యార్థులు వ్యాసరచన పోటీలు నిర్వహించి, బహుమతులు అందజేశారు. బొర్నగూడెం స్పోర్ట్స్ స్కూల్లో హెచ్ఎం శాస్త్రి పాల్గొన్నారు.

రైతులకు అండగా ప్రభుత్వం

పాడేరు ఎమ్మెల్యే కొట్టగుల్లి భాగ్యలక్ష్మి



రైతులకు రాజ్‌మా విత్తనాలు పంపిణీ చేస్తున్న పాడేరు ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి

చింతపల్లి: చిన్నగెడ్డ రైతు భరోసా కేంద్రంలో గిరిజన రైతులకు 90 శాతం రాయితీపై రాజ్‌మా విత్తనాలను పాడేరు ఎమ్మెల్యే కొట్టగుల్లి భాగ్యలక్ష్మి సోమవారం పంపిణీ చేశారు. ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహాన్ని గిరిజనులు వినియోగించుకోవాలని కోరారు. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో విత్తనాలు సకాలంలో పంపిణీ చేయకపోవడం వలన రైతులు ఇబ్బందులు పడ్డారన్నారు. ప్రస్తుత ప్రభుత్వం రైతులకు అండగా నిలుస్తోందని, సంక్షేమ పథకాలు అమలుచేస్తోందని వాటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. జెడ్పీటీసీ సభ్యుడు బాలయ్య, మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ జల్లి హలియారాణి, సర్పంచ్ పుష్పలత, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు రవి తదితరులు పాల్గొన్నారు.

రైతుల పక్షానే ప్రభుత్వం

గూడెంకొత్తవీధి: విత్తనాల పంపిణీ నుంచి పంట కొనుగోలు వరకు అన్ని విధాలుగా ప్రభుత్వం రైతుల పక్షానే పనిచేస్తోందని ఎమ్మెల్యే కొట్టగుల్లి భాగ్యలక్ష్మి అన్నారు. స్థానిక ఆర్‌బీకేలో రాజ్‌మా విత్తనాలను ఆమె పంపిణీ చేశారు. 702 క్వింటాళ్ల రాజ్‌మా విత్తనాలు అందుబాటులో ఉన్నాయని, రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఎంపీపీ కుమారి, జెడ్పీటీసీ శివరత్నం, వైస్ ఎంపీపీ దేముడు, మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ హలియారాణి పాల్గొన్నారు.

రోడ్డు పనులకు శంకుస్థాపన

దుంబ్రిగుడ: సొవ్వా పంచాయతీ గొప్పులవలసలో సీసీ రోడ్డు నిర్మాణ పనులను సర్పంచ్ పాండోయి సాయిత సోమవారం శంకుస్థాపన చేశారు. ఆమె మాట్లాడుతూ గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు ప్రభుత్వం పెద్దపీట వేసిందన్నారు. వైఎస్సార్‌సీపీ నాయకుడు అశోక్ తదితరులు పాల్గొన్నారు.

గొర్రెలు, మేకలకు వ్యాక్సిన్లు

దుంబ్రిగుడ: కురిడి పంచాయతీ గోరాపూర్, గదబగ్గులుంగు, బలియగుడ, పుట్టబంధ, గొడ్డిగుడ, కురిడి, నిమ్మగెడ్డ, జంగివలస తదితర గ్రామాల్లో పశుసంవర్థక శాఖ వైద్యులు గౌతమ్, రాజశ్రీ ఆధ్వర్యంలో సోమవారం వైద్య శిబిరాలు నిర్వహించారు.

డ్రైవర్లకు లైసెన్స్ తప్పనిసరి

దుంబ్రిగుడ: సొవ్వ పంచాయతీ కేంద్రంలో ఎస్ఐ సంతోష్ కుమార్ సోమవారం పర్యటించారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ నిబంధనలపై ఆటో డ్రైవర్లకు కౌన్సెలింగ్ ఇచ్చారు. ప్రతి డ్రైవర్ తప్పనిసరిగా లైసెన్స్ కలిగి ఉండాలన్నారు. పరిమితికి మించి ప్రయాణికులను తీసుకెళ్లొద్దని సూచించారు. ట్రాఫిక్ నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

చిన్నారుల చదువుపై శ్రద్ధ అవసరం

పెదబయలు: గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలికల పాఠశాల–1లో సోమవారం విద్యార్థుల తల్లిదండ్రుల సమావేశం జరిగింది. హెచ్ఎం చెట్టి నారాయణ మాట్లాడుతూ చిన్నారుల చదువుపై తల్లిదండ్రులు శ్రద్ధ తీసుకోవాలన్నారు.

సమన్వయంతో పనిచేయాలి

పాడేరు రూరల్ : గ్రామ సచివాలయ సిబ్బంది, పంచాయతీ సర్పంచ్‌ల మధ్య సమన్వయం ఎంతో అవసరమని ప్రజాప్రతినిధులు, అధికారుల సమన్వయంతోనే సమస్యలు పరిష్కారమవుతుందని ఎంపీడీవో కె.సాయి నవీన్ అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం సర్పంచ్‌లు, గ్రామ సచివాలయ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో సమస్యలను సర్పంచ్ గ్రామ సచివాలయ సిబ్బంది దృష్టికి తేవాలన్నారు. ఈవోపీఆర్డీ విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

నాలుగో విడత కౌన్సెలింగ్ పూర్తి

చింతపల్లి: స్థానిక ఆర్‌ఐటీఐలో సోమవారం నాలుగో విడత కౌన్సెలింగ్ పూర్తయినట్టు ప్రిన్సిపాల్ రాజారావు తెలిపారు. చింతపల్లి, సీలేరుకు సంబంధించి మొత్తం 134 సీట్లకుగాను 207 మంది దరఖాస్తులు చేసుకోగా 110 మంది హాజరైనట్టు ప్రిన్సిపాల్ తెలిపారు.

మట్టి వినాయక ప్రతిమల పంపిణీ

అరకులోయ: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు మట్టి వినాయక ప్రతిమలను ప్రిన్సిపాల్ డాక్టర్ కె.భరత్‌నాయక్ సోమవారం పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ మట్టి వినాయక ప్రతిమలను పూజించి, పర్యావరణ పరిరక్షణకు భాగస్వామ్యం కావాలని కోరారు. ఎన్ఎస్ఎస్ పీవోలు, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

గృహ హక్కు పత్రాలు అందజేత



పత్రాలిస్తున్న వైస్ ఎంపీపీ ఆనంద్

గూడెంకొత్తవీధి: పెదవలస సచివాలయ కేంద్రంలో అర్హులైన 25 మంది లబ్ధిదారులకు గృహ హక్కు పత్రాలను వైస్ ఎంపీపీ ఆనంద్, సర్పంచ్ కృష్ణారావు సోమవారం అందజేశారు. వారు మాట్లాడుతూ ప్రభుత్వ పక్కా గృహాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వీఆర్‌వో గంగభవాని, నాయకులు పాల్గొన్నారు.

'రమ్య'మైన ప్రతిభ





రమ్య సాధించిన జాతీయ, అంతర్జాతీయ అవార్డులు (ఇన్‌సెట్) అవార్డులను చూపుతున్న మిర్రర్ రైటర్ రమ్య



కుటుంబ సభ్యులతో రమ్య

- మిర్రర్ రైటింగ్‌లో దూసుకెళ్తున్న యువతి పలు అవార్డులు సొంతం
- గిన్నీస్ రికార్డు దిశగా అడుగులు

నర్సీపట్నం: జీవితమంటే.. రొటిన్‌గా ఉండకూడదు. సమాజంలో మనకంటూ గుర్తింపు ఉండాలి. అలా కావాలంటే ఇష్టమైన రంగంలో రాణించాలి. అందులోనూ వైవిధ్యం చూపించాలి. అప్పుడే మన జీవితానికి సార్థకత అని విద్యార్థి దశలో గురువు చెప్పిన మాటలు ఆమె మనసులో బలంగా నాటుకుపోయాయి. వాటినే ఆచరణలో పెట్టిన నర్సీపట్నం మండలం ధర్మసాగరం గ్రామానికి చెందిన మామిడి రమ్యకు అవార్డులు దాసోహం అవుతున్నాయి.

మోహన్‌రావు, మీనాక్షి దంపతులకు ఇద్దరు కవల పిల్లలు. తండ్రి రెక్కల కష్టంపై వీరు వెటర్నరీ డిప్లొమా కోర్సు పూర్తి చేశారు. కవలల్లో ఒకరైన రమ్యకు హైస్కూల్ విద్యాభ్యాసం సమయంలో ప్రిన్సిపాల్ సునీల్ చెప్పిన మాటలు ఆమెను ఆలోచింపచేశాయి. ఏం చేయాలనే దానిపై నిత్యం శోధన చేసింది. ఈ క్రమంలో ఒకసారి మిర్రర్ రైటింగ్‌లో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా వ్యక్తి అవార్డు పొందిన విషయాన్ని తెలుసుకుంది. అతని కంటే మిన్నగా ప్రయత్నం చేస్తే దానిలో తన ప్రత్యేకతను చాటుకోవచ్చని భావించింది. సంకల్పాన్ని లక్ష్యాన్ని చేసుకుని రెండేళ్లపాటు నిరంతరం ఇంటికొచ్చి మిర్రర్ రైటింగ్ ప్రాక్టీసు చేసింది. ముందుగా తెలుగు, ఇంగ్లిషు, హిందీ భాషలను మిర్రర్ రైటింగ్ రాయడంలో ప్రతిభ చూపిన యువతి ఇతర భాషలకు విస్తరించింది. ఈ విధంగా ఇంటర్నెట్‌లో శోధన చేసి, అచ్చమైన గుజరాతీ, తమిళ్, మళయాళీ, నేపాలీ భాషల్లో రాయడం నేర్చుకుంది. మిర్రర్ రైటింగ్‌లో రాణిస్తూ పలువురి ప్రశంసలు పొందడమే కాకుండా పలు రికార్డులను సొంతం చేసుకుంది. భవిష్యత్తులో 28 భాషల్లో అంబేడ్కర్ బయోగ్రఫీ రాసి, గిన్నీస్ రికార్డు సాధించాలనే కోరికతో నిరంతరం శ్రమిస్తోంది.

వరల్డ్ వైడ్ బుక్ ఆఫ్ రికార్డు: వందేమాతరం గీతాన్ని తెలుగు లో 90 సెకన్లలో మిర్రర్ రైటింగ్ రాసినందుకు అవార్డు వరించింది. ఈ పద్ధతి ద్వారా ఇంగ్లిష్‌లో 250 అక్షరాలను 2 నిమిషాల్లో రాసినందుకు రికార్డు సాధించింది.

ఇంటర్నేషనల్ బుక్ ఆఫ్ రికార్డు : తెలుగు, ఇంగ్లీషు, హిందీ, తమిళ, మలయాళంలో వందేమాతరం గీతాన్ని మిర్రర్ రైటింగ్‌లో ప్రెజెంట్ చేసినందుకు రికార్డు వరించింది.

ఇంటర్నేషనల్ వండర్ బుక్ ఆఫ్ రికార్డు: తెలుగులో రామాయణం, వందేమాతరం, ఇంగ్లిష్‌లో అంబేడ్కర్ బయోగ్రఫీ, వందేమాతరం, హిందీలో రంజాన్ ఫెస్టివల్ హిస్టరీ, వందేమాతరం, తమిళ్, మలయాళీ, నేపాలీ, గుజరాతీ భాషల్లో వందేమాతరం గీతాన్ని మిర్రర్ రైటింగ్‌లో రాసినందుకు రికార్డు సాధించింది.

ఇంటర్నేషనల్ ఎక్సలెన్సీ అవార్డు బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డు: తెలుగు, ఇంగ్లిషు, హిందీ భాషల్లో వందేమాతరం గీతాన్ని మిర్రర్ రైటింగ్‌లో ప్రజెంట్ చేసినందుకు అవార్డు లభించింది.

నేడే చిన్నారుల చేతుల్లో మట్టి గణపతి

వినాయకుని పండుగ వస్తోంది! వినాయక చవితి రోజు మీరు పుస్తకాలు, పూజలో ఉంచి, గణపతికి ఇష్టమైన మధురమైన పిండి వంటలు ఆరగింపజేసి, మీ కోరికలన్నీ కోరే సమయం ఆసన్నమైంది. అయితే మీరు పూజించాల్సిన వినాయకుణ్ని మీరే మీ చిట్టి చేతులతో తయారు చేస్తే 'గణాధిపతి'

ఎంతో సంతోషించి వరాలనిస్తాడు. మాకు విగ్రహం చేయడం రాదని చింతించకండి. విగ్రహం తయారు చేసే విధానం గురించి 'సాక్షి' మీడియా గ్రూప్, ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి వారి సహకారంతో మీకు శిక్షణనిచ్చేందుకు ఉచిత శిబిరాన్ని నిర్వహిస్తోంది.

ఈ నెల 30వ తేదీన జరిగే ఈ కార్యక్రమంలో 5 నుంచి 16 సంవత్సరాల లోపు ఉన్న బాలలందరూ పాల్గొనవచ్చు. దీనికి ఎటువంటి రుసుము చెల్లించనక్కరలేదు. బంకమట్టిని సైతం నిర్వాహకులే ఉచితంగా ఇస్తారు. మీరు దిగువ తెలిపిన నంబర్లకు ఫోన్ చేసి పేర్లను నమోదు చేసుకుంటే చాలు. పర్యావరణానికి మేలు చేసే విధంగా మట్టిని ప్రతిమలుగా మలిచి, రూపొందించే విధానాన్ని నేర్పిస్తారు. ఇంకెందుకు ఆలస్యం మీరు కూడా ఈ శిక్షణ కార్యక్రమంలో పాల్గొని, మీరు తయారు చేసిన వినాయక ప్రతిమలను ఇంటికి తీసుకెళ్లి పూజించండి. శిక్షణకు వచ్చేవారు పాత వాటర్ బాటిల్, పాత వస్త్రం వెంట తీసుకురండి.

అవిఘ్నమస్తు.. అభీష్ట సిద్ధిరస్తు..

శిబిరం చిరునామా : రామకృష్ణ స్కూల్, ఎన్ఎస్‌టీఎల్ పక్కన, ఎన్ఏడీ జంక్షన్, విశాఖపట్నం

తేదీ: 30-08-2022 (మంగళవారం)

సమయం: ఉదయం 9.30 నుంచి 12.30 వరకు.

సంప్రదించవలసిన ఫోన్ నంబరు :

96660 13544

అల్లూరి టెలీ ఫిలిం షూటింగ్ ప్రారంభం

ఎంవీపీకాలనీ: అల్లూరి జీవిత చరిత్రలో తెరకెక్కుతున్న టెలీఫిలిం షూటింగ్ సోమవారం ప్రారంభమైంది. ఈ టెలీ ఫిలిం తొలిషాట్‌కు జీవీఎంసీ కమిషనర్ లక్ష్మీశ క్లాప్ కొట్టారు. ఈ సందర్భంగా వీఎంఆర్‌డీఏ హెల్త్ ఎరీనాలో గాయకుడు, నటుడు ఆర్‌వీ సత్యనారాయణపై చిత్ర బృందం పలు సన్నివేశాలను చిత్రీకరించింది. అల్లూరి సీతారామరాజుగా ఆర్‌వీ సత్యనారాయణ నటించడంతో పాటు కథ, దర్శకత్వం, నిర్మాణ బాధ్యతలను నిర్వహిస్తున్నారు.

తెలుగు భాషపై సీఎంకు అపారమైన గౌరవం

- తెలుగు భాషా దినోత్సవంలో పరిశ్రమలు, ఐటీ శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్

అనకాపల్లి టౌన్: దేశ భాషలందు తెలుగు లెస్స అన్నాడో మహా కవి... తెలుగు భాష తియ్యదనం, గౌరవం గురించి ప్రత్యేక చెప్పాల్సినవసరం లేదని, భాష, గౌరవాన్ని, గొప్పతనాన్ని ప్రభుత్వం కాపాడుతుందని పరిశ్రమలు, ఐటీ శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ అన్నారు. స్థానిక ఎన్టీఆర్ క్రీడా మైదానంలో తెలుగు భాషా దినోత్సవంతోపాటు క్రీడా దినోత్సవాన్ని సోమవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గిడుగు రామ్మూర్తి పంతులు జయంతి పురస్కరించుకుని రాష్ట్ర ప్రభుత్వం తెలుగు భాషా దినోత్సవాన్ని అధికారంగా నిర్వహించడం గర్వించదగ్గ విషయమన్నారు. ప్రభుత్వం ఆంగ్ల బోధనను తెలుగు భాషను విస్మరిస్తోందంటూ ప్రతిపక్షాలు చేస్తున్న విమర్శలను ఆయన ఖండించారు. విద్యార్థులు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించాలనే ఉద్దేశంతోనే ఆంగ్ల బోధనను ప్రవేశ పెట్టామన్నారు. తెలుగు భాషపై సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి అపారమైన గౌరవం ఉందన్నారు.



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న మంత్రి గుడివాడ అమర్‌నాథ్



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న మంత్రి అమర్‌నాథ్

క్రీడాకారులకు మరింత ప్రోత్సాహం...

ప్రముఖ హాకీ క్రీడాకారుడు ధ్యాన్‌చంద్ జయంతిని పురస్కరించుకుని దేశవ్యాప్తంగా అంతర్జాతీయ క్రీడా దినోత్సవంగా ప్రకటించడం అభినందనీయని మంత్రి అమర్‌నాథ్ అన్నారు. ప్రభుత్వం క్రీడలను ప్రోత్సహించేందుకు వైఎస్సార్ క్రీడా ప్రోగ్రాం కింద రూ.9.5 కోట్లు ఖర్చు చేస్తోందని తెలిపారు. జాతీయ, అంతర్జాతీయ స్థాయి ప్రతిభ కనబర్చిన క్రీడాకారులకు ప్రభుత్వ ఉద్యోగాలతో గౌరవిస్తామన్నారు. స్థానిక క్రీడాకారులకు మరింత తర్ఫీదునిచ్చి జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో విజేతలయ్యేందుకు కోచ్‌లు నడుం బిగించాలన్నారు. కలెక్టర్ రవి పట్టాన్ శెట్టి మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో క్రీడలకు ప్రభుత్వం పెద్దపీట వేస్తుందన్నారు. అంతకుమందు క్రీడాకారులను మంత్రి పరిచయం చేసుకుని కోచ్‌లను సత్కరించారు. విద్యార్థినుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. మండలంలో మార్టూరు ప్రైవేటు మినరల్ వాటర్ ప్లాంట్‌ను ప్రారంభించారు. డీఈవో లింగేశ్వరరెడ్డి, శాప్ డైరెక్టర్ శ్రీనివాసరావు, జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ భీశెట్టి వరహా సత్యవతి, జెడ్సీ కనకమహాలక్ష్మి, 82వ వార్డు కార్పొరేటర్ మందపాటి సునీత, పార్టీ పట్టణాధ్యక్షుడు మందపాటి జానకీరామరాజు పాల్గొన్నారు.

గిరిజనులు వ్యాపారవేత్తలుగా ఎదగాలి

- డీఆర్‌డీఏ పీడీ మురళి



ముసిడిపుట్టు పాఠశాలలో మధ్యాహ్న భోజనం నాణ్యతను పరిశీలిస్తున్న డీఆర్‌డీఏ పీడీ మురళి

పెదబయలు: గిరిజనులు వ్యాపారవేత్తలుగా ఎదగాలని, అందుకోసం ప్రభుత్వం మొదటి విడతలో 70 మందికి రుణాలు మంజూరు చేసిందని డీఆర్‌డీఏ ప్రాజెక్టు డైరెక్టర్ వి.మురళి తెలిపారు. సోమవారం స్థానిక వారపు సంతను ఆయన సందర్శించారు. సంతకు వచ్చిన ప్రజలు కొనుగోలు చేసే సామగ్రి, గిరిజన రైతులు విక్రయానికి తెచ్చిన సరకులను పరిశీలించారు. మైదాన ప్రాంతం, ఒడిశా నుంచి వ్యాపారుల సంతల్లో ఎక్కువగా దుకాణాలు ఏర్పాటు చేస్తున్నారని, స్థానిక గిరిజనులు కూడా వ్యాపారాల్లో రాణించాలని తెలిపారు. ప్రతి మండలంలో 5 నుంచి 12 మందికి ప్రతి నెలా వివిధ వ్యాపారాలకు రుణాలు అందిస్తామని చెప్పారు. ఈ అవకాశాన్ని గిరిజనులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం ముసిడిపుట్టు ఎంపీపీ పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకం అమలు తీరును పరిశీలించారు. నాణ్యతా ప్రమాణాలు పాటించాలని సూచించారు. అనంతరం మండల సమాఖ్య కార్యాలయంలో రికార్డులను పరిశీలించారు. వైఎస్సార్ ఆసరా పథకం పొందడానికి 45 ఏళ్లు దాటిన అర్హత కలిగిన మహిళలు అక్టోబర్ 5 తేదీలోపు గ్రామ సచివాలయాల్లో పేర్లు నమోదు చేసుకోవాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో వెలుగు ఏపీఎం ఈశ్వరబాబు నాయుడు తదితరులు పాల్గొన్నారు.

డ్వాక్రా అక్కచెల్లెమ్మలకు 'వైఎస్సార్ ఆసరా'



డ్వాక్రా మహిళలకు చెక్కు అందజేస్తున్న ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు

దేవరాపల్లి: డ్వాక్రా అక్కచెల్లెమ్మలకు వైఎస్సార్ ఆసరా పథకంతో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అండగా నిలుస్తున్నారని ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు అన్నారు. సోమవారం తారువ క్యాంప్ కార్యాలయంలో ఆయన చెక్కు లను అందజేశారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి డ్వాక్రా మహిళలు కృతజ్ఞతలు తెలియజేశారు.

విద్యుత్ కేంద్రాల ఆధునికీకరణకు చర్యలు

సీలేరు : స్థానిక జలవిద్యుత్ కాంప్లెక్స్ పరిధిలోని సీలేరు, డొంకరాయి, మోతుగూడెంతో పాటు మాచ్‌ఖండ్ తదితర విద్యుత్ కేంద్రాల యూనిట్ల ఆధునికీకరణకు చర్యలు చేపడుతున్నట్టు ఏపీ జెన్‌కో విద్యుత్ సౌధ సివిల్ చీఫ్ ఇంజినీర్ సి.డి.వి.ఎల్. కుమార్ తెలిపారు. మోతుగూడెంలో మరో రెండు అదనపు యూనిట్ల నిర్మాణానికి త్వరలో పనులు ప్రారంభం కానున్నట్టు చెప్పారు. సీలేరు జలవిద్యుత్ కేంద్రంలో యూనిట్ల పనితీరు, ప్రస్తుతం ఎన్ని మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి అవుతోంది తదితర వివరాలు తెలుసుకున్నారు. ఎంసీఆర్, గుంటవాడ డ్యామ్, రెగ్యులేటర్ డ్యాంలను సోమవారం ఆయన పరిశీలించారు.అనంతరం మాట్లాడుతూ స్థానిక జలవిద్యుత్ కేంద్రం నిర్మించి 50ఏళ్లవుతున్నా నిరాటంకంగా విద్యుత్ ఉత్పత్తి చేయడం గొప్ప విషయమని చెప్పారు. విద్యుత్ ఉత్పత్తిలో సీలేరు కాంప్లెక్సులోని జలవిద్యుత్ కేంద్రాలు ఎంతో కీలక పాత్ర పోషిస్తున్నాయన్నారు. అనంతరం ఇంజినీర్లు, కార్మికుల సమస్యల అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో సూపరింటెండెంట్ ఇంజినీర్లు శేఖర్, ప్రశాంత్‌కుమార్, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ జాకీర్ హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.



సీలేరు జలవిద్యుత్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఏపీ జెన్‌కో సివిల్ చీఫ్ ఇంజనీర్ సీడీవీఎల్ కుమార్